# వ్యాసం

# మండల్ కమీషన్ నివేదిక

కేంద్రప్రభుత్వం మండల్ కమీషన్ నివేదికననుసరించి ఉద్యోగాలలో 27% వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ ప్రకటించగానే దేశవ్యాప్తంగా రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన ప్రారంభమైంది. విద్యార్థులేకాక రాజకీయ నాయకులు, న్యాయవాదులు, జర్నలిస్టులు, సైంటిస్టులు కూడా రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్నారు. రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనకారులు మండల్ కమిషన్ నివేదిక అశాస్త్రీయమైనదని, సరైన ఆధారాలు చూపకుండానే మండల్ నివేదిక కులం ఆధారంగా రిజర్వేషన్లను సూచించిందని ఆరోపణలు చేస్తున్నారు. పత్రికలు ఈ ఆరోపణలకు విస్తృత ప్రచారాన్ని కల్పిస్తున్నాయి.

నివేదికను జాగ్రత్తగా పరిశీలిస్తే నివేదిక అశాస్త్రీయమైనదని కొందరు చేస్తున్న ప్రచారం దురుద్దేశంతో కూడుకున్నదని స్పష్టమవుతుంది. మండల్ కమీషన్ ఈ నివేదికను రూపొందించడం కోసం దేశవ్యాప్తంగా పర్యటించి వివిధ ప్రాంతాల్లోని రాజకీయ నాయకులను, ప్రజాకార్యకర్తలను కలిసి సంప్రదింపులు జరిపింది. సామాజిక శాస్త్రవేత్తల అభిప్రాయాలను సేకరించింది. కోర్టుల తీర్పులను నిశితంగా పరిశీలించింది. దేశంలోని ప్రతిజిల్లానుంచి రెండు గ్రామాలను, ఒక పట్టణాన్ని సర్వేజరిపింది. ఉద్యోగాలలో వివిధ కులాల ప్రాతినిధ్యాన్ని పరిశీలించింది. ఇంత జరిగిన తర్వాతే నివేదిక రూపకల్పన జరిగింది. కులాన్నే రిజర్వేషన్లకు ప్రాతిపదికగా ఎంచుకోటానికి కారణాలను నివేదిక చాలా స్పష్టంగా వివరించింది.

మన సమాజం కులం ఆధారంగా విభజింపబడింది. ఈ విభజనను ధర్మశాస్త్రాలన్నీ సమర్థించాయి. అంతేకాదు ధర్మశాస్త్రాలు ప్రతికులానికి ఒక స్థాయిని ఆ స్థాయిని బట్టి విధులను నిర్వచించాయి. సామాజిక స్థాయి, విధులతో పాటు దాదాపు జీవితంలోని అన్ని అంశాలను కులం నిర్దేశిస్తుంది. తిండి, బట్ట, నివాసం వంటి అన్ని అంశాలు కులాన్ని బట్టి మారుతుంటాయి.

కుల వ్యవస్థ ఉచ్ఛనీచ వర్ణాలుగా ప్రజలను విడగొట్టింది. ఇందులో ఉన్నత స్థాయి పొందిన వర్ణాలు తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవటం కోసం ధర్మశాస్త్రాల మద్దతుతో, రాజ్య యంత్రాంగం సహాయంతో కులవ్యవస్థను పకడ్బందీగా కాపాడాయి.

కాలక్రమేణా కులవ్యవస్థలో మార్పుచేర్పులు వచ్చాయి. బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన సమన్యాయపాలన, పారిశ్రామికీకరణ, పట్టణాల అభివృద్ధి, సార్వజనీన వయోజన ఓటు హక్కు వంటి మార్పులు కులవ్యవస్థలో మార్పులను తెచ్చాయి. అయితే ఈ మార్పుల వలన కులవ్యవస్థ విచ్ఛిన్నం కాలేదు. కులానికి చెందిన కొన్ని సాంప్రదాయకమైన లక్షణాలు కొంత సడలినా కులం ఆధారంగా కొందరు ఆధిపత్యం చలాయించడం కొనసాగుతూనే ఉన్నది. కులం రాజకీయ నాయకత్వాన్ని పొందటానికి కావలసిన ప్రజాసమీకరణకు ఒక సాధనంగా మారింది.

("Caste system provided the political leadership with ready-made channels of communication and mobilisation and in view of this., the importance of caste was bound to increase in Indian Politics".)

ఇటువంటి సమాజంలో అందరినీ సమానంగా పరిగణించడం వలన వెనుకబడిన కులాలకు నష్టం వాటిల్లుతుంది. అసమానులను సమానులుగా చూడటమంటే అసమానతను కాపాడటమే అవుతుంది.(To treat unequals as equals is to perpetuate unequality.) అందువలన వెనుకబడిన కులాలకు ప్రత్యేక రాయితీలు కల్పించాలి.

అయితే వెనుకబడిన కులాలు అంటే ఏవి? ఏయే కులాలైతే సామాజికంగా విద్యాపరంగా వెనుకబాటుతనాన్ని అనుభవిస్తున్నాయో అవే వెనుకబడిన కులాలు. సామాజికంగా వెనుకబడినా లేదా కేవలం విద్యాపరంగా వెనుకబడినా ఏ కులమూ వెనుకబడిన కులంకాలేదు. కనుక రెండు రంగాలలోనూ వెనుకబాటుతనం గల కులమే వెనుకబడిన కులం.

సామాజిక, విద్యారంగాలలో వెనుకబాటుతనాన్ని మదింపు వేయటానికి ఈ కింది కారణాలను కమిషన్ పరిగణనలోకి తీసుకొన్నది.

**సామాజిక పరమైన కారణాలు**

1. ఇతరులచే వెనుకబడిన కులంగా పరిగణించబడే కులాలు.
2. జీవన భృతికై శారీరక శ్రమపై ఆధారపడే కులాలు.
3. 17 సంవత్సరాల వయస్సులోపు పెళ్ళిళ్లు జరిగే స్త్రీల శాతం రాష్ట్ర సగటుతో పోల్చి చూసినప్పుడు 25% కంటె ఎక్కువ, పురుషుల శాతం 10% కంటె ఎక్కువగా నున్న కులాలు. పట్టణాలలోనైతే రాష్ట్ర సగటుతో పోల్చిచూస్తే స్త్రీల విషయంలో 10% పురుషులలో 5% ఎక్కువగా గల కులాలు.
4. పనిలో స్త్రీల భాగస్వామ్యం రాష్ట్ర సగటుకన్నా 25% ఎక్కువగల కులాలు.

**విద్యావిషయాలు**

1. 5 - 15 సంవత్సరాల మధ్య వయసు గల బాల బాలికల్లో అసలు బడికే వెళ్ళని వారి శాతం రాష్ట్ర సగటుకన్నా 25% ఎక్కువగల కులాలు.
2. పైన పేర్కొన్న వయస్సు గ్రూపులో చదువు మధ్యలో మానేసేవారు (drop outs) రాష్ట్ర సగటుకన్నా 25% ఎక్కువగా నున్న కులాలు.
3. మెట్రిక్యులేట్ల సంఖ్య రాష్ట్ర సగటుకన్నా 25% తక్కువగల కులాలు.

**ఆర్థిక కారణాలు**

1. కుటుంబ ఆస్తుల సగటు విలువ రాష్ట్ర సగటుకన్నా 25% తక్కువ గల కులాలు.
2. కచ్చా ఇళ్ళలో నివసించే వారి సంఖ్య రాష్ట్ర సగటుకన్నా 25% ఎక్కువగల కులాలు.
3. 50% పైగా కుటుంబాలు మంచినీటి సౌకర్యం కోసం కనీసం 1/2 కి.మీ. దూరం వెళ్లవలసివచ్చే కులాలు.
4. రాష్ట్రప్రభుత్వం నుంచి వినిమయ ఋణాలు తీసుకున్న వారి సంఖ్య రాష్ట్ర సగటుకన్నా 25% ఎక్కువగల కులాలు.

ఈ విషయాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి వెనుకబడిన కులాలను గుర్తించడం జరిగింది. కొన్ని కులాలు (చాలా చిన్న గ్రూపులుగా వుండేవి) సర్వే చేసిన గ్రామాల్లో ఉండకపోవచ్చు. అటువంటి కులాలను రాష్ట్ర జాబితాను పరిశీలించి, ఇంత వరకు జరిపిన సర్వేల ఆధారంగా రాజకీయ నాయకులు, ప్రజాకార్యకర్తల అభిప్రాయాలను దృష్టిలోఉంచుకుని వెనుకబడిన కులాల జాబితాలో చేర్చారు.

ఈ విధంగా గుర్తించబడిన కులాల ప్రాతినిధ్యం కేంద్ర సర్వీసుల్లో చాలా తక్కువగా ఉన్నది.

ఇన్ని అంశాలను పరిశీలించిన మీదట, వివిధ రాష్ట్రాల్లో రిజర్వేషన్ల అమలు తీరు తెన్నులు, రిజర్వేషన్లను అమలు పరిచినప్పుడు అగ్రవర్ణాల నుంచి వచ్చిన వ్యతిరేకతను దృష్టిలో వుంచుకొని కమిషన్ రికమెండేషన్లను రూపొందించింది. కమిషన్ నివేదికలో ఇచ్చిన సూచనలు ఇలా వున్నాయి.

1. ఉద్యోగాలలో 27% రిజర్వేషన్లు
2. విద్యాలయాల్లో 27% రిజర్వేషన్లు
3. వెనుకబడిన తరగతులకు ప్రత్యేకస్కూళ్ళు, హాస్టళ్ళు
4. ప్రత్యేక వృత్తి శిక్షణ
5. వృత్తుల పరిరక్షణకు సాంకేతిక, ఆర్థిక సహాయం
6. అందుకై ప్రత్యేక ఆర్థిక సంస్థల ఏర్పాటు
7. భూసంస్కరణల చట్టాల అమలు.

రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సహజంగా వచ్చే ప్రశ్నలకు కూడా కమిషన్ సమాధానాలు ఇచ్చింది. రిజర్వేషన్ల వలన ధనికులకే లాభం జరుగుతుందని, రిజర్వేషన్లవలన వెనుకబడిన కులాలకు చెందిన పేదలకు ఒరిగేదేమీ లేదని, అగ్రవర్ణాల పిల్లలు దానివలన బాధపడతారని రిజర్వేషన్ వ్యతిరేకులు సాధారణంగా అంటూ వుంటారు. ఈ వాదనలకు మండల్ నివేదికలో జవాబులు వున్నాయి.

బ్రిటిష్ వాళ్ళు కూడా ఈ దేశాన్ని వదిలిపెట్టాలంటే బాధపడ్డారు. అలాగని భారతీయులు స్వాతంత్ర్యం కోసం డిమాండ్ చేయకుండా ఊరుకోలేదు. తెల్లవాళ్ళు బాధపడతారని శ్వేతజాతి దురహంకారానికి వ్యతిరేకంగా పోరాటం ఆగలేదు. అదే విధంగా కొంతమంది బాధపడతారని కులవ్యవస్థ నిర్మూలనకు జరిగే ప్రయత్నాలు ఆగవు.

రిజర్వేషన్లవలన మొత్తం వెనుకబడిన కులాల వారంతా అభివృద్ధి చెందుతారని అనుకుంటే భ్రమేఅవుతుంది. ఎవ్వరైనా రిజర్వేషన్ వలన కలెక్టరో, పోలీసు సూపరింటెండెంటో అయితే దాని వలన లాభపడేది అలా నియమించబడిన వారి కుటుంబమే. అయితే ఒక వెనుకబడిన కులానికి చెందిన వ్యక్తి అధికారి అయితే ఆ కులానికి చెందినవారు తమ సామాజిక స్థాయి పెరిగిందన్న సంతృప్తిని పొందుతారు.

ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పాలనలో భాగస్వామ్యం కావాలని డిమాండ్ చేసే హక్కు ఉంటుంది. దానిని కొంతైనా అమలు పరచడం అవసరం. ఒక ప్రజాస్వామిక వ్యవస్థలో 52% పైన జనాభాగల సెక్షనుకు ప్రాతినిధ్యం కల్పించని పరిస్థితిని మార్చడంలో రిజర్వేషన్లు ఒక సాధనం.

అయితే ఎక్కువ భాగం రాయితీలు వెనుకబడిన కులాలవారిలోని పైస్థాయివారికే సంక్రమించే అవకాశం ఉన్నది. అయితే ఏ కార్యక్రమం అమలులోనైనా ఇది తప్పదు. ఏ సంస్కరణ కార్యక్రమమైనా క్రమంగానే దిగువనున్న వారిని చేరుతుంది.

నేటి విద్యావ్యవస్థ వెనుకబడిన కులాల అవసరాలకు తగినట్టుగా లేదని కమిషన్ గుర్తించింది. బ్రిటిష్‌వారు ప్రవేశపెట్టిన విద్యావ్యవస్థ ఎన్నో విమర్శలకు గురైనా ఇంతవరకు మార్పులకు నోచుకోలేదు. అయితే విద్యావ్యవస్థ సంస్కరణ కమిషన్ పరిధిలోకిరాదు కనుక కేవలం ఉన్న వ్యవస్థలో వెనుకబడిన కులాలకు అవకాశాలను పెంచటానికి సూచనలు చేశారు. వెనుకబడిన కులాల విద్యార్థులు చదువుకోవటానికి వివిధ సంక్షేమ కార్యక్రమాలను (ప్రత్యేక రెసిడెన్షియల్ స్కూళ్ళు, స్కాలర్‌షిప్పులు, హాస్టళ్ళు తదితరములు) సమన్వయపరచి సమగ్రంగా అమలు జరపాలని కమిషన్ సూచించింది.

ఇప్పుడున్న వ్యవస్థలో అగ్రవర్ణాల పిల్లలు వెనుకబడిన కులాల పిల్లలు సమానంగా పోటీ పడలేక పోవటానికి కారణం కేవలం వారి కుటుంబ వాతావరణంలో తేడాలేనని కమిషన్ గుర్తించింది. అందుకే పోటీపడడానికి వీలుగా అనువైన వాతావరణం కల్పించడానికి తల్లితండ్రులకు వయోజన విద్యావకాశాలు కల్పించాలి.

కేవలం రిజర్వేషన్ల వలన, ఆర్థిక, సాంకేతిక సహాయాల వలన వెనుకబాటుతనం పోదని కమిషన్ గుర్తించింది. జనాభాలో 1/4 వంతు మాత్రమే గల అగ్రవర్ణాల వారు ఉత్పత్తి సాధనాలపై గుత్తాధిపత్యం పొంది దాని ఆధారంగా ఆధిపత్యం చెలాయించగలుగుతున్నారు. ఆ ఆధిపత్యం వారికి రాజకీయాధికారాన్నిచ్చింది. దానికి తోడుగా ప్రభుత్వ యంత్రాంగంలో దాదాపు అందరూ అగ్రవర్ణాలవారే. వారితో వున్న కుల సంబంధాల ఆధారంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని తమకు అనుగుణంగా ఉపయోగించుకోగలుగుతున్నారు. అందుకే ఇప్పుడున్న ఉత్పత్తి సంబంధాలను విప్లవాత్మకంగా మార్చకుండా వెనుకబడిన కులాల సంపూర్ణ అభివృద్ధి సాధ్యంకాదు. వెనువెంటనే పారిశ్రామిక రంగంలో మార్పులు సాధ్యం కాకపోయినా, వ్యవసాయ రంగంలో మార్పులు తేవడానికి అవసరమైన చట్టాలున్నాయి. వాటి అమలులో ఇప్పటికే ఆలస్యం జరిగింది. అందుకని వెంటనే భూ పరిమితి చట్టాల సక్రమ అమలుకు కృషిచేయాలని కమిషన్ సూచించింది.

ఈ విధంగా కమిషన్ వెనుకబడిన కులాల గుర్తింపుకై తీవ్రకృషి చేసింది. ఇప్పుడు రిజర్వేషన్ వ్యతిరేకులు తమ డిమాండ్లను సాధించడం కోసం రిజర్వేషన్ల వలన తమ ఆధిపత్యం ఎక్కడ పోతుందోనన్న బాధతో నివేదికపై బురద చల్లటానికి ప్రయత్నం చేస్తున్నారు. నివేదికను అశాస్త్రీయమైందని రుజువుచేసి, ఆ నివేదిక ఆధారంగా వచ్చిన రిజర్వేషన్లను రూపుమాపాలని చూస్తున్నారు. అందుకే నివేదికను సక్రమంగా పరిశీలించి సమర్థించవలసిన అవసరం చాలా ఉంది.

## కోర్టులు – రిజర్వేషన్లు

ప్రజాస్వామిక వ్యవస్థకు రెండు ప్రధాన లక్షణాలున్నాయి. మొదటిది చట్టబద్ధపాలన. అంటే చట్టం అందరినీ సమానంగా పరిగణించాలి. ఏ